క్లుప్తంగా

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన

సదుం: మండలంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టుల విధులను గురువారం న్యాయవాదులు బహిష్కరించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ శుక్రవారం కూడ విధులు బహిష్కరించనున్నట్లు తెలిపారు. విజయవాడ న్యాయవాది వి.భగవాన్‌ను బెదిరించడమే కాకుండా దాడి చేసినందుకు నిరసనగా రెండు రోజులు విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి, రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం పంపామన్నారు.

చౌడేశ్వరీదేవికి పొంగళ్లు


విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ ఓదులపేటలో గ్రామదేవత శ్రీచౌడేశ్వరీదేవికి గ్రామస్తులు గురువారం పొంగళ్లు పెట్టారు. అర్చకులు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. ఏటా ఉగాది మరుసటి రోజు అమ్మవారికి పొంగళ్లు నివేదించడం ఆనవాయితీ.

రేపు మహాచండీ హోమం

రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయంలో శనివారం మహా చండీహోమం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త గుర్రప్ప తెలిపారు. అదేవిధంగా ఆదివారం కలశపూజ, అభిషేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు.స్వామివారికి అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఉంటుందన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తెలుగు క్యాలెండర్ల పంపిణీ



కుప్పంరూరల్: ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో తెలుగు ఉగాది క్యాలెండర్లను ఆ సంఘం సభ్యులు పంపిణీ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం, పోలీసుస్టేషన్, ఎంపీడీవో, తహశీల్దారు కార్యాలయంలో సిబ్బందికి వీటిని అందజేశారు. సమితి ప్రతినిధి కృష్ణ మాట్లాడుతూ ఏటా ఉగాది హిందూ క్యాలెండర్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రకాశ్, కృష్ణారెడ్డి, శరవణ, శివ, మంజునాథ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

26న సద్భావన సదస్సు

పుంగనూరు: హిందూ సమాజానికి సంబంధించి అనేక సమస్యలను, సవాళ్లను సమర్థవంతంగా ఎలా ఎదుర్కొనాలో చర్చించేందుకు ఈ నెల 26న హిందూ సద్భావన సదస్సు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు రవీంద్రనాథ్, త్రిమూర్తిరెడ్డి, వినాయక తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆరోజు ఉదయం ఉదయం 10 గంటలకు హిందూ పెద్దలతో, యువకులతో చర్చా వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసదస్సుకు ప్రతి ఒక్కరు హాజరై అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి


ఆర్డీఓకు జర్నలిస్టుల వినతిపత్రం

పలమనేరు: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) పలమనేరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధు లు కోరారు. ఈమేరకు స్థానిక ఆర్డీవో శివయ్యకు గురువారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఏటా మార్చి 23వ తేదీన సేవ్ జర్నలిజం డేను స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ పేరిట జరుపుకుంటున్నా మని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనిశ్చిత వాతావరణం, జర్నలిస్టులపై జరిగే దా డులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టులకు రక్షణగా ప్రత్యేక చట్టాన్ని తేవాల్సి అవసరం ఉందని తెలిపారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకాలను అందించాలని డిమాండ్ చేశారు.

సిరులొలికించే వెదురు

- నేషనల్ బ్యాంబోమిషన్ ద్వారా సాగుకు రాయితీ
- ప్రభుత్వ భూముల్లో వందశాతం.. రైతులకు 50 శాతం సబ్సిడీ
- చీడపీడలు, కూలీల బాధలకు చెల్లుచీటి
- ఎలాంటి భూముల్లోనైనా సాగు చేసుకోవచ్చు
- 30 ఏళ్లు ఏటా గ్యారెంటీ ఆదాయం

జిల్లాలోని రైతులు రకరకాల వాణిజ్య పంటలు సాగుచేసి నష్టాలు చవిచూస్తుంటారు. ఏపంట సాగుచేసినా గ్యారెంటీ ఆదాయం దక్కుతుందనే నమ్మకం లేదు. ఇలాంటి పరిస్థితులో ప్రభుత్వం వెదురుసాగును ప్రోత్సహిస్తోంది. ఎలాంటి భూములైనా, మిట్టపల్లాలుగా ఉన్నా దీనికి ఇబ్బంది లేదు. ముఖ్యంగా చీడపీడల ఇబ్బందులు, కూలీల సమస్య అసలుండదు. ఓ దఫా నాటితే పదేళ్ల వరకు ఆదాయం వస్తూనే ఉంటుంది. ఈ ఏడాది చిత్తూరు జిల్లాలో 200 హెక్టార్లలో వెదురు సాగు లక్ష్యంగా ఉద్యానశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో వెదురు సాగుకు రైతుల ఎంపిక ప్రక్రియను ఉద్యాన శాఖ ప్రారంభించింది.


వెదురు తోటలు


వెదురు మొక్కల నర్సరీ

పలమనేరు: జిల్లాలో వెదురు సాగును ప్రోత్సహించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. వెదురు సాగును పెంచాలనే లక్ష్యంతో నేషనల్ బ్యాంబో మిషన్ పనిచేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వానికి చెందిన భూములు, కార్యాలయాల వద్ద ఖాళీ ప్రదేశాలు, అటవీశాఖ ద్వారా సామాజిక వనాల సాగు, పంచాయతీల పరిధిల్లోని ఖాళీ భూములు, ఇలా ప్రభుత్వానికి చెందిన భూముల్లో సాగు చేస్తే హెక్టారుకు రూ.లక్ష సబ్సిడీ ఉంటుంది. అదే రైతుల భూముల్లో సాగు చేసుకుంటే హెక్టారుకు రూ.50 వేల సబ్సిడీ ఇస్తారు. రైతుల భూముల్లో బ్లాంక్ ప్లాంటేషన్ లేదా బోర్డర్ ప్లాంటేషన్లకు సైతం రాయితీలు వర్తిస్తాయి. అయితే హెక్టారుకు 400 మొక్కలు కచ్చితంగా నాటాలి. ఇదేకాక రైతులు పొలాల్లో వెదురు నర్సరీలను పెట్టుకుంటే పెట్టుబడిలో 50 శాతం రాయితీ ఉంటుంది. రానున్న రోజుల్లో వెదురుసాగును చిన్నతరహా పరిశ్రమగా ప్రభుత్వం గుర్తించే అవకాశం ఉంది.

అంతర్జాతీయంగా డిమాండ్

ఇప్పటికే వెదురుకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. రానున్న రోజుల్లో మరింత డిమాండ్ వచ్చే అవకాశం ఉంది. వెదురు ద్వారా పేపర్, నిర్మాణాలకు కర్రలుగా, కొయ్య బొమ్మలు, వంటచెరుకు తయారీకి వినియోగిస్తారు. స్థానికంగానూ వెదురుకు మంచి మార్కెటింగ్ ఉంది. ప్రస్తుతం జిల్లాలో బీడుగా లేదా సాగుకు పెద్దగా యోగ్యం గాని భూములు దాదాపు 30 వేల హెక్టార్లుగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ భూముల్లో అధికారులు సాగు ప్రారంభిస్తారని సమాచారం.

> **30 ఏళ్లు రాబడులే..**
>
> హెక్టారులో వెదురును నాటేందుకు రూ. లక్ష దాకా ఖర్చు ఉంటుంది. ఇందులో 50 శాతం అంటే రూ.50 వేలు ప్రభుత్వం రాయితీగా అందజేస్తుంది. వెదురును ఓ సారి నాటితే జీవిత కాలం 30 ఏళ్లు ఉంటుంది. మొదటి మూడేళ్ల వరకు మొక్కలను జాగ్రత్తగా పెంచుకోవాలి. ఆపై ఏటా వెదురును కట్ చేస్తుంటే మళ్లీ మరిన్ని పిలకలు వచ్చి తోట మరింతగా అభివృద్ధి చెందుతుంది. హెక్టారు పొలంలో మూడేళ్ల నుంచి తోట పెరిగే కొద్దీ రూ. లక్ష వరకు ఆదాయం పొందవచ్చు.

సాగులో ఇబ్బందులుండవు

దున్నకం, కలుపుతీత, క్రిమి సంహారకమందుల పిచికారీ కష్టాలు వెదురుసాగులో ఉండవు. నాటిన మొక్కలు బతికాక ఏ ఇబ్బందీ ఉండదు. చదునైన భూములు అవసరం లేదు. మెట్టభూములు, ఎత్తుపల్లాల భూములన్నా ఇబ్బంది లేదు. నీటి సౌకర్యం కూడా పెద్దగా అవసరం లేదు. వర్షాలతోనే పెరుగుతుంది. ఎలాంటి వాతారణ పరిస్థితులకైనా తట్టుకుంటుంది. పొలాల చుట్టూ నాటుకుంటే చేనుకు రక్షణ కంచెలా మారుతుంది. పంటలకు గాలులు రాకుండా అడ్డుకట్ట వేస్తుంది. వర్షాకాలంలో మెట్ట భూముల్లో నేల కోతలకు గురికాకుండా ఉంటుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వ జాతీయ వెదురు మిషన్ ద్వారా పబ్లిక్ స్థలాల్లో సాగుకు వందశాతం సబ్సిడీ ఉంది. అదే రైతులు పొలం మొత్తంలోనూ లేదా భూమి చుట్టూ నాటుకున్నా 50 శాతం సబ్సిడీ ఇస్తాం. ఆసక్తిగల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఓదఫానాటితే మళ్లీ దానికి చేయాల్సిందేమీ లేదు. గ్యారెంటీగా ఆదాయం దక్కే పంట వెదురు.

–డాక్టర్ కోటేశ్వరావు, హార్టీ కల్చర్ ఏడీ, పలమనేరు డివిజన్

పార్టీ పటిష్టతలో గృహ సారథులే కీలకం


జగనన్న కిట్లను పంపిణీ చేస్తున్న పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథ్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): పార్టీ పటిష్టతలో గృహసారథులే కీలకమని పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. గురువారం ఎనిమిది సచివాలయాల పరిధిలోని పంచాయతీల గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, వాటి ద్వారా పొందిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మరిన్ని పథకాలను తీసుకువస్తారని వివరించాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి పర్యటనను ప్రారంభించాలని తెలిపారు. అనంతరం జగనన్న కిట్లను గృహ సారథులు, కన్వీనర్లకు పంపిణీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, ఎంపీ మిథున్‌రెడ్డి పీఏ బాలకృష్ణరాజు, రెడ్డీశ్వరరెడ్డి, నాదమునిరెడ్డి, ముర్వత్‌బాషా, పోకల చంద్ర, రెడ్డిఅహమ్మద్, హేమసుందరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, దామోదర్, గోవిందరెడ్డి, సర్పంచ్‌లు షుకూర్, రాణెమ్మ, ప్రతాప్‌రెడ్డి, స్వాతిబాల, లక్ష్మి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వీరుల త్యాగం వెలకట్టలేనిది


భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు నివాళి

పెద్దపంజాణి: సమరయోధుల త్యాగం వెలకట్టలేనిదని, భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగమే నేటి స్వేచ్ఛా భారత్ అని హెచ్‌ఎం బాబు రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం బాబు రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం చిన్న వయస్సులో ఉరికంబం ఎక్కిన ఈ ముగ్గురి వీరత్వం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వారి సేవలను కొనియాడారు. వారి చిత్ర పటాలకు నివాళులర్పించి, విద్యార్థులచే జోహార్లు చెప్పించారు. ఉపాధ్యాయులు సుజాత, వాణిశ్రీ, హేమంత్, రాజేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి


నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగరాజ, ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగరాజ ఆదేశించారు. గురువారం ఎంపీపీ ఈశ్వరయ్యతో కలిసి మండలంలోని కందూరు, బాలప్పగారిపల్లె లేవుట్లను పరిశీలించారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న నిర్మాణాలు పూర్తి చేయడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని లబ్ధిదారులను ప్రశ్నించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్, హౌసింగ్ సిబ్బందికి సూచించారు.అనంతరం కందూరు మేజర్ పంచాయతీ సచివాలయాన్ని ఎంపీడీఓ నాగరాజ తనిఖీ చేశారు. వలంటీర్, సచివాలయ ఉద్యోగుల హాజరు బయోమెట్రిక్ పరిశీలించారు. పలు సూచనలిచ్చారు. హౌసింగ్ ఏఈ జావీద్ ఆలీ, పంచాయతీ కార్యదర్శి జైశంకర్, వైఎస్సార్‌సీపీ నేత మెకానిక్ బాషా పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 31 మంది గైర్హాజరు

పుంగనూరు: ఇంటర్మీడియెట్ ఫస్ట్ పరీక్షలకు గురువారం 31 మంది విద్యార్థులు గైర్హజరయ్యారు. పట్టణంలో మూడు సెంటర్లలో మొత్తం 531 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 31 మంది విద్యార్థులు హాజరు కాలేదు. పరీక్షలు సజావుగా సాగినట్లు ఆయా సెంటర్ల పర్యవేక్షణాధికారులు రెడ్డెప్ప, కమలాకర్, విజయకుమారి తెలిపారు.

వి.కోటలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: పట్టణంలోని నాయకనేరి రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏటీఎం కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి బ్యాంకు సేవలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు బ్యాంకు సిబ్బంది ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, సింగిల్‌విండో చైర్మెన్ ధవనంభక్త, దామోదర్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీరామాలయంలో విగ్రహ ప్రతిష్ట


నూతనంగా నిర్మించిన రామాలయం

చౌడేపల్లె: మండలంలోని బిల్లేరు గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నిర్మించిన శ్రీరామాలయంలో శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల శుక్రవారం ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం హోమ, కలశ పూజలు, విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, వేద ఆశీర్వాదం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. గ్రామస్తులు, పరిసర ప్రాంత ప్రజలు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

శ్రీరామాలయ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న గ్రామ పెద్దలు

బైరెడ్డిపల్లె: మండలంలోని తొరిడి సమీపంలో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ సమీపంలో తిరుమల తిరుపతి దేవస్థానం సాయంతో శ్రీరామాలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని గ్రామస్తులు కోరారు. దాతలు విరివిగా విరాళాలు ఇవ్వాలని

అనాథ శవానికి అంత్యక్రియలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేటలో గురువారం పంచాయతీ వారు అనాథ శవానికి అంత్య క్రియలు నిర్వహించారు. కొన్ని రోజులుగా గ్రామంలో భిక్షాటనతో జీవనం సాగిస్తున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. అనాథ మృతదేహం కావడంతో సర్పంచ్ మధు పంచాయతీ సిబ్బందితో కలిసి అంత్యక్రియలు దగ్గరుండి నిర్వహించారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ టి. శ్రీనివాస విశ్వనాథ్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులు, అభివృద్ధి ప్రణాళికల నమోదు, స్పందన ఫిర్యాదుల పరిష్కారం తదితరాలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధిపై సీఎంకు వినతి


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలను విన్నవిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే వెంకటేగౌడ కోరారు. గురువారం తాడేపల్లెలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎంను ఆయన కలిశారు.

వైఎస్సార్ ఆసరా రూ.5.73 కోట్ల మంజూరు


పుంగనూరు : సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, నయీంతాజ్

పుంగనూరు: మున్సిపల్ పరిధిలో వైఎస్సార్ ఆసరా పథకం కింద లబ్ధిదారులకు రూ.5.73 కోట్లు మంజూరైనట్లు ఐకేపీ టౌన్‌మిషన్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమంపై కుమ్మరవీధి, నానబాలవీధి ప్రాంతాల్లో మహిళా గ్రూపులకు కౌన్సిలర్లు నయీంతాజ్, అర్షద్‌అలితో అవగాహన సదస్సు నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో 680 గ్రూపుల్లోని 6,351 మంది మహిళలకు రూ.5.73 కోట్లు ఖాతాల్లో జమ కానున్నదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25న సభ్యుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తారని తెలిపారు. ఆర్పీలు కృష్ణవేణి, ఆరీఫా, అమరావతి, విజయ, సుజాత, రామలక్ష్మి, ప్రసన్న, నయీమున్నిసా, తాజున్ను పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం


సదుం: బూరగమంద సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం హరిప్రసాద్

సదుం: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఏపీయం హరిప్రసాద్ తెలిపారు. ఈనెల 25 వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరు కానున్న నేపథ్యంలో బూరగమంద, రెడ్డివారిపల్లె, తాటిగుంటపాలెం, అమ్మగారిపల్లె, చింతలవారిపల్లె, చింతమాకులపల్లె, పాలమంద పంచాయతీల్లో గురువారం అవగాహన సమాశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..18 పంచాయతీల పరిధిలో 746 స్వయం సహాయక సంఘాలు ఉన్నట్టు చెప్పారు. ఇందులోని 6, 531 మంది సభ్యులకు మూడో విడతలో రూ. 8. 23 కోట్ల మేర నిధులు మంజూరు కానున్నట్టు చెప్పారు. సీసీ సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ


విశేషాలంకరణలో అమ్మవారు

రామకుప్పం: మండలంలోని అత్తికుప్పం శ్రీదత్తమునీంద్ర ఆశ్రమంలో గురువారం నూతన విగ్రహాల ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీపరమహంస ఆధ్వర్యంలో ఆశ్రమంలో దత్తాత్రేయ, సద్గురు మునీంద్ర స్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠ, వరద గణపతి,లలితా పరమేశ్వరీ అమ్మవార్ల నూతన శిలా విగ్రహాల ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.

పంటలు బాగా పండాలని..


పాపిశెట్టిపల్లెలో నడివీధి గంగమ్మ

చౌడేపల్లె: ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, జంతు సంపద వృద్ధి చెందాలని, వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో గంగమ్మకు గ్రామస్తులు పూజలు చేశారు. మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ పాపిశెట్టిపల్లె, పందిళ్లపల్లె పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా గంగ జాతర వేడుకలను నిర్వహించారు. గ్రామదేవతలు మారెమ్మ, బోయకొండ గంగమ్మ నడివీధి గంగమ్మ విగ్రహాలను ప్రత్యేకంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకుని దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. గ్రామాల్లో బంధుమిత్రులతో సందడినెలకొంది.

పటిష్టంగా చెత్త నుంచి సంపద తయారీ


చంద్రమాకులపల్లె సదస్సులో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లో తడిచెత్త, పొడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం పెంచుకోవాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని చంద్రమాకులపల్లెలో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కింద పుంగనూరు, చౌడేపల్లె మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆర్బీకే సిబ్బంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్ పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు చెత్తను వేరు చేసి వాటిని సంపద కేంద్రాలకు తరలించాలని తెలిపారు. చెత్తను వర్మికంపోస్టుగా మార్చి రైతులకు తక్కువ ధరకు విక్రయించడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని పేర్కొన్నారు. సంపద తయారీని పటిష్టంగా నిర్వహిస్తే పంచాయతీలు ఆర్థికంగా బలోపేతమవుతాయని తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, వరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే


పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు

పెద్దపంజాణి: మండలంలోని 7 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీసర్వే పక్కాగా చేపడుతున్నట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. మొదట విడతగా రీసర్వే పూర్తయిన మండలంలోని శంకర్రాయలపేట, నిడిగుంట గ్రామాల్లో వారం రోజులుగా యంత్రాలతో గుంతలు తీయించి సరిహద్దు రాల్లు(సర్వేరాళ్లు) నాటే పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేరాళ్లు నాటే సమయంలో రైతులు రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. మండల సర్వేయర్ ఆంజనేయులు పాల్గొన్నారు.